క్లుప్తంగా

ముగిసిన వేసవి శిబిరం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని సరస్వతి శిశు మందిరిలో పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరం మంగళవారంతో ముగిసింది. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన వేసవి శిబిరంలో సుమారుగా 50 మంది చిన్నారులు పాల్గొని కోలాటం, కూచిపూడి, చెక్కభజన, కమ్యూనికేషన్స్, ఇంగ్లీష్ భగవద్గీత శ్లోకాలు మొదలగు వాటిల్లో నైపుణ్యం సాధించిన్నట్లు ప్రధానోపాధ్యారాలు గీత తెలిపారు. ముగింపు కార్యక్రమానికి అమెరికాకు చెందిన దంత వైద్య నిపుణుడు శ్రీకాంత్, పాకాల దుర్గాప్రసాద్ పాల్గొని విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందజేశారు. గట్టు వెంకటాచారి, కుంచాల రాజారామ్, అమరవాది శేషాచార్యులు, రాజా శ్రీనివాస్, ఆవుల సుబ్బారావు, కల్యాణ్ కృష్ణ కుమార్, నాగేశ్వరరావు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



విత్తనాల షాపులో తనిఖీ చేస్తున్న ఏడీఏ రవికుమార్

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని ఎరువులు, విత్తనాల షాపుల్లో మంగళవారం ఏడీఏ రవికుమార్ తనిఖీలు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో నకిలీ విత్తనాల సరఫరా, అమ్మకాలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు. విత్తనాల విక్రయాలు నిబంధనల ప్రకారం చేయాలని, విత్తనాల స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు బోర్డుపై ఉంచాలని డీలర్లకు సూచించారు. రైతులు అడిగిన విత్తనాలనే ఇవ్వాలని, విధిగా రసీదు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. ఆయన వెంట ఏఈ నవీన్, ఏఈఓలు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మణుగూరుటౌన్: ఏరియా కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ చూపాలని అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మేకల ఈశ్వర్ రావు అన్నారు. మంగళవారం పీవీకాలనీలోని కేఎల్ మహేంద్ర భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేపీయూజీ గనిలో పని చేస్తున్న కార్మికులకు గమ్‌షూస్ ఇవ్వాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. మ్యాన్ పవర్ తగ్గి కార్మికులపై పనిఒత్తిడి, వెంటిలేషన్ సమస్య, ఓసీ-4 లో కన్వేయిన్స్ సమస్య, పీవీకాలనీలోని క్వార్టర్ల రిపేర్లు, కేసీహెచ్‌పీ జంక్షన్ రోడ్డుకు మరమ్మతులు, పీవీకాలనీలో రాత్రివేళలో ఎస్‌అండ్‌పీసీ గస్తీ ఏర్పాట్లు తదితర సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో నాయకులు రామనర్సయ్య, ఆవుల నాగరాజు, అంతోని రవికుమార్, ఇమాముద్దీన్, గోవింద్ కుమారస్వామి ఉన్నారు.

భూసార పరీక్షలు చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త నాగాంజలి

దమ్మపేట: రానున్న వర్షాకాలం దృష్ట్యా ముందస్తుగా భూసార పరీక్షలు చేయించుకోవాల్సిన ఆవశ్యకతను అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త నాగాంజలి, రైతులకు వివరించారు. మంగళవారం మండలంలోని మల్లారం గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'కార్యక్రమం నిర్వహించగా.. డాక్టర్ నాగాంజలి మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేయాల్సిన పంటల వివరాలు, సాగులో మెళకువలు, నూతన పద్ధతులను సమగ్రంగా వివరించారు. రసాయనిక ఎరువుల మోతాదును తగ్గించి, వాటి స్థానంలో వాడాల్సిన సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాల గురించి తెలియజేశారు. జల సంరక్షణకు నీటి కుంటలను వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త మధుసూదన్ రెడ్డి, వ్యవసాయ అధికారి చంద్రశేఖర రెడ్డి,పశు వైద్యురాలు తేజరాణి, రైతులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన టీడీపీ శ్రేణులు

గుండాల: నందమూరి తారక రామారావు జయంతి వేడుకల్లో భాగంగా ప్రతి ఏటా ఏపీలోని కడపలో నిర్వహించే టీడీపీ మహానాడు సభకు స్థానిక పార్టీ శ్రేణులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ సందర్భంగా పార్టీ నియోజక వర్గ సమన్వయ కర్త ఇల్లందుల నర్సింహులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోలెం సాంబయ్య, ఇల్లందుల అప్పారావులు గుండాలలో మాట్లాడుతూ.. రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రంలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహానాడుకు తరలివెళ్లిన వారిలో వాగబోయిన పుల్లయ్య, మొల్కం మధు, మల్లయ్య, యాకయ్య, రామకృష్ణ, ఉశార్ తదితరులు పాల్గొన్నారు.



'సీతారామ' భూసేకరణ గ్రామసభను అడ్డుకున్న గిరిజన రైతులు (ఫైల్)



గిరిజన భూముల్లో తవ్విన వెంకమ్మ వరద కాలువ ఇదే..

పరిహారమిస్తేనే ముందడుగు

17 ఏళ్లుగా అందని 'వెంకమ్మ వరద కాలువ' పరిహారం

- 'సీతారామ' గ్రామసభ వివాదంతో తెరపైకి..
- ఆ పరిహారమిస్తేకానీ 'సీతారామ'కు తొలగని అడ్డంకులు

'సీతారామ' ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం భూసేకరణ కోసం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఇటీవలే పలు పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించారు. అందులో భాగంగా అశ్వారావుపేట మండలం రామన్నగూడెం పంచాయతీలో గ్రామసభ నిర్వహణకు వెళ్లిన ఆ రెండు శాఖల అధికారులకు షాక్ ఎదురైంది. వెంకమ్మ వరద కాలువ నష్ట పరిహారం సంగతి తెల్చితేనే.. సీతారామ ప్రాజెక్టు భూసేకరణకు సహకరిస్తామని అధికారులకు స్థానికులు తేల్చిచెప్పారు. దీంతో వెంకమ్మ వరద కాలువ నష్ట పరిహార వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది.

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి వద్దగల వెంకమ్మ చెరువు అలుగు నుంచి ఏటా వానాకాలం సీజన్‌లో వేలాది క్యూసెక్కుల వరదనీరు వాగుల్లో కలిసి వృథా అవుతోంది. ఈ జలాలు వృథా కాకుండా కాలువలు నిర్మించి పంట పొలాలకు మళ్లించేందుకు, తద్వారా వేలాది ఎకరాల గిరిజన భూములకు సాగునీరు అందించేందుకు నాడు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పూనుకున్నారు. ఈ మేరకు 2005 డిసెంబర్ 31న కాలువ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మాణాలకు వైఎస్సార్ హాయంలోనే రూ.13 కోట్లు నిధులు కేటాయించారు. ఈ క్రమంలోనే 2009వ సంవత్సరంలో ఇరిగేషన్ శాఖ ద్వారా ఓ కాంట్రాక్టర్ ఒప్పందం కాగా.. 2010లో వరద కాలువ తవ్వకాల పనులు చేపట్టారు. వెంకమ్మ చెరువు నుంచి(కేసప్పగూడెం) దబ్బతోగు ప్రాజెక్టు చెరువు దాకా 15 కిలో మీటర్లు, అక్కడి నుంచి లోతువాగు చెరువుకు మరో 7 కిలోమీటర్లు కలిపి మొత్తం 22 కిలోమీటర్ల దూరం వరకు వరద కాలువ తీయాల్సి ఉంది. ఈ పనులు రెండేళ్ల క్రితం వరకు ఆగుతూ.. సాగుతూ.. మొత్తం 18 కిలోమీటర్ల వరకు పూర్తి చేశారు. మిగిలిన మరో మూడు కిలోమీటర్ల కాలువ పూర్తి కావాల్సి ఉండగా.. పనులు నిలిచిపోయాయి. అలాగే లోతువాగు చెరువు వరకు మొత్తం 46 చోట్ల స్లక్చర్లు, ఆక్విడెక్టులకు గాను మరో 10 నిర్మించాల్సి ఉంది. ఈ కొద్ది పనులను పూర్తి చేస్తే వృథా వరద నీరు ఈ కాలువల ద్వారా దబ్బతోగు, లోతువాగు చెరువులోకి చేరి 5వేల ఎకరాలకు సాగునీరు పారుతుంది.

సంవత్సరాలుగా నిరీక్షణ..

ఈ వరద కాలువ కింద రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు భూములు సేకరించి 17 సంవత్సరాలు గడిస్తున్నా.. నేటికీ భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వలేదు. అటవీ శాఖ, ఇతర ఇబ్బందులు తొలగి పనులు చివరి దశకు చేరిన రైతులుకు నష్ట పరిహారం మంజూరు కాలేదు. కాలువ పనుల్లో అశ్వారావుపేట మండలంలోని ఊట్లపల్లి, రామన్నగూడెం, దబ్బతోగు, దబ్బతోగు కాలనీ, మల్లాయిగూడెం, కామయ్యనగర్, వినాయకపురం, దిబ్బగూడెం, వేదాంతపురంకు చెందిన 92 మంది రైతులకుగాను 42 ఎకరాల వ్యవసాయ భూములకు నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉంది. వీటిలో 20 ఎకరాలు పట్టా భూములు, మరో 22 ఎకరాలు అసైన్డ్ భూములకు ఉన్నాయి. వీటికి భూసేకరణ సమయంలో ఒకొక్క ఎకరానికి రూ.1లక్ష 35వేలు చొప్పున ప్రభుత్వం నిర్ణయించగా.. తీవ్ర జాప్యమైంది. కాగా ఐదేళ్ల క్రితం పాత భూసేకరణ చట్ట ప్రకారం రూ.78లక్షల నిధులు మంజూరు చేసింది. కానీ అప్పటికే 2013 భూసేకరణ చట్టం అములులోకి వచ్చి ఏడేళ్లు దాటిపోవడంతో కొత్త భూసేకరణ చట్టం కింద పరిహారం ఇవ్వాలని, నష్ట పరిహారం చెక్కులను తిరస్కరించారు.

సీతారామ పనులకు అడ్డంకి..

తాజాగా సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ కోసం కొద్ది రోజుల క్రితం గ్రామసభల ఏర్పాటును అధికారులు ప్రకటించారు. మండలంలో ఎంపిక చేసిన పంచాయతీల్లో గ్రామసభలు ప్రశాంతంగా జరగ్గా.. రామన్నగూడెం పంచాయతీ గ్రామసభ మాత్రం వెంకమ్మ వరద కాలువ బాధిత రైతుల ఆందోళనతో వాయిదా పడింది. కాలువ నష్ట పరిహారాన్ని ఇస్తేనే 'సీతారామ'భూసేకరణ ముందుకు సాగుతుందని గిరిజనులు పట్టుబట్టారు. దాదాపు రెండు గంటల పాటు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల వాహనాల ముందు బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఈ హామీ మేరకు సోమవారం స్థానిక అధికారులు బాధిత రైతులను జిల్లా కలెక్టరేట్‌కు తీసుకెళ్లి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కానీ నష్ట పరిహారం వ్యవహారం తేలేదాకా ఈ పంచాయతీ పరిధిలో సీతారామ భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీ కాలువ నిర్మాణాలు ముందుకు సాగేలా కనిపించడం లేదు.

మణుగూరు రక్షణకు పటిష్ట చర్యలు



పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: గత ఆగస్టు నెలాఖరున కురిసిన వర్షానికి ముంపునకు గురైన మణుగూరు రక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం విప్పలసింగారం గ్రామంలో రూ.83.40లక్షల వ్యయంతో కట్టువాగు పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది వచ్చిన వర్షాలకు ముంపునకు గురవడంతో 2వేల కుటుంబాలు వరద వల్ల ఇల్లు కొట్టుకుపోయాయన్నారు. ప్రతి కుటుంబానికి రూ.16,500 చొప్పున అందజేశామన్నారు. ఈ సారి రానున్న వర్షాకాలాన్ని ముందుగానే దృష్టి సారించి పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. ఇకపై వరదలు రాకుండా మణుగూరు రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, గోరంట్ల కనకయ్య, కల్యాణ్, మండల నాయకులు నవీన్, శివ, సతీష్, కూచిపూడి బాబుతోపాటు పలువురు సింగరేణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

ప్రజాభవన్‌లో నియోజకవర్గ హౌసింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇళ్లపై ఎమ్మెల్యే పాయం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణ విధానాన్ని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. మరోవైపు, జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతిని పురస్కరించుకుని, ప్రజాభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు.

ఆస్పత్రికి వస్తేనే స్వస్థత



గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్య బృందం

దుమ్ముగూడెం: జ్వరం వస్తే ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని మందులను వాడాలి తప్ప మూఢ నమ్మకాలపై ఆధారపరకూడదని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ ప్రజలకు సూచించారు. పెద్దకమలాపురం గ్రామంలో మలేరియా జ్వరానికి గురై చికిత్స పొంది ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న కంగాల రాంబాబు ఇంటిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాంబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జ్వరం వస్తే గవర్నమెంట్ హాస్పిటల్‌కి చికిత్స తీసుకోవాలని, మూఢ నమ్మకాలతో దేవర్ల దగ్గరికి వెళ్లకూడదని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రుక్మాకర్ రెడ్డి,ఏయంఓ కుమార్ స్వామి, హెచ్‌ఈఓ అజయ్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్లు జేతురాం, ధర్మారావు, హెల్త్ సూపర్‌వైజర్ సాగర్ , ల్యాబ్ టెక్నీషియన్ మురళి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా సబ్సిడీ విత్తనాలు

చర్ల: రైతులకు అవసరమైన జీలుగు వరి విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు సిద్ధం చేసినట్లు చర్ల మండల వ్యవసాయశాఖాధికారి లావణ్య మంగళవారం తెలిపారు. మండలంలోని చర్ల, సత్యనారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా జీలుగు, బీపీటీ 5204 రకం వరి విత్తనాలు అందుబాటుల ఉంచినట్లు ఆమె తెలిపారు.

30 కిలోల జీలుగు విత్తనాల బ్యాగ్.. సబ్సిడీపై ధర రూ.2,137.50లుగా, 25 కిలోల వరి (బీపీటీ 5204 రకం) విత్తనాల బ్యాగ్ ధర రూ.1,137.50లుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సమీపంలోని పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్‌లను తీసుకొని వారి క్లస్టర్ పరిధిలో ఉన్న రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి అనుమతి పొంది సమీపంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో విత్తనాలు తీసుకోవాలని ఆమె సూచించారు. చర్ల సహకార సంఘంలో 166 బ్యాగుల జీలుగు విత్తనాలు, 120 బ్యాగుల వరి విత్తనాలు బ్యాగులు అదే విధంగా సత్యనారాయణపురం సహకార సంఘంలో 200 బ్యాగుల జీలుగు విత్తనాలు, 120 బ్యాగుల వరి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. బుదవారం నుంచి విత్తనాలు విక్రయించన్నట్లు ఆమె వెల్లడించారు.

పోలీసుల నేతృత్వాన మరమ్మతులు



రాళ్లాపురానికి వెళ్లే రహదారికి కొనసాగుతున్న మరమ్మతు పనులు

చర్ల: మండలంలోని తిప్పాపురం గ్రామ పంచాయతీ రాళ్లాపురం మార్గానికి పోలీసులు మంగళవారం మరమతులు చేయించారు. ఈ గిరిజన గ్రామానికి తాలిపేరు ప్రాజెక్టు సమీపంలోని తిప్పాపురం రోడ్ నుంచి అటవీ ప్రాంతం మీదుగా కాలిబాట ఉండగా మార్గ మధ్యలో చెరువు గట్లు, వాగు ఉన్నాయి. దీనివల్ల ఏటా వర్షాకాలంలో అక్కడి ఆదివాసీలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు గర్భిణులను ప్రసవం కోసం గ్రామస్తులు జడ్డీలు కట్టి ప్రధాన రహదారి వరకు మోసుకొచ్చిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఈ వర్షాకాలం అటువంటి పరిస్థితులు ఎదురవ్వకూడదన్న ఉద్దేశ్యంతో ఈ దారికి మరమతులు చేయించేందుకు చర్ల పోలీస్ సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్‌లు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా సుమారు 3 కిలోమీటర్ల దారి పొడవునా గ్రావెల్ పోయించి గుంతలను పూడ్చించడంతో పాటు కల్వర్టులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసుశాఖకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



వంతెన పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: మండలంలో మంగళవారం సుడిగాలి పర్యటన చేసిన స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లంకాలపల్లి గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువపై, గిరిజన రైతుల సౌకర్యార్థం నిర్మించనున్న వంతెన పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దమ్మపేట గ్రామంలో నిర్మాణంలో ఉన్న పేరంటాల చెరువు మరమ్మతులను పరిశీలించారు. అదే గ్రామంలో కోమళ్ల చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. పలువురికి నివాళులు, పరామర్శలు చేశారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు రావు గంగాధరరరావు, కక్కిరాల రమేష్, పర్వతనేని ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, సాయిల నర్సీ, ఏసుమణి, వాసం శ్రీను, రొయ్యల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో భారీ వర్షం



నర్సాపురం తండాలో రోడ్డుపై వర్షపు నీరు..

గుండాల: గుండాల మండలంలో మంగళవారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తోంది. నిన్న, మొన్నటి నుంచి మబ్బులు చేస్తూ, మరో పక్క ఎండలు కొడుతూ సోమవారం రెండు గంట పాటు కుండపోత వర్షం కురిసింది. దీంతో ఎడారిలా మారిన వాగులు స్వల్పంగా పారాయి. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయం అయ్యాయి. అంతర్గత రోడ్లు చెరువులను తలపించాయి. సుమారు రెండు గంటల పాటు వర్షం కురవడంతో కరెంటుకు అంతరాయం ఏర్పడింది. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు ఇదే తొలివాన కావడంతో ఇప్పటికే దుక్కులు చేసుకున్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యాసంగిలో సాగు చేసిన పంటలను కల్లాల్లో ఆరబోయగా తడిసిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ మండల యువజన అధ్యక్షుడిగా చెన్నకేశవులు

పినపాక: బీఆర్‌ఎస్ పార్టీ పినపాక మండలం యువజన విభాగ అధ్యక్షుడిగా పాండురంగపురం గ్రామానికి చెందిన యాదగిరి చెన్నకేశవలను ఆ పార్టీ నియమించింది. ఈ మేరకు మంగళవారం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తానని, యువతను ఏకతాటి మీదకు తీసుకొచ్చి ప్రభుత్వ వైఫల్యాలను ఎన్నగడతానని చెన్నకేశవులు తెలిపారు.

దాడులకు ఖండన

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ క్యాంప్ కార్యాలయంపై కొంతమంది గుండాలు చేసిన దౌర్జన్యం చేశారని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, యూత్ నాయకులు నారం రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్లాయిగూడెంలో జరిగిన యూత్ సమావేశంలో మాట్లాడారు.

మైనారిటీ గురుకులాల్లో అడ్మిషన్లు

అశ్వారావుపేటరూరల్: ప్రభుత్వ మైనారిటీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.సంగీత తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రథమ సంవత్సరంలో సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు కళాశాలకు వచ్చి స్వయంగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయని వెల్లడించారు.

తహసీల్దార్‌కు శుభాకాంక్షలు

అశ్వాపురం: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రాజారావును మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ మండల నాయకుడు ఓరుగంటి రమేష్, మాజీ మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే ఖదీర్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గొల్లపల్లి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

ఓసీ ప్రభావితులకు న్యాయం చేయండి



మణుగూరురూరల్: సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య

మణుగూరురూరల్: ఓసీ ప్రభావిత గ్రామాలైన రాజుపేట, విఠల్‌రావునగర్ ప్రజలకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓసీ బ్లాస్టింగులతో ఇళ్లు బీటలు బారుతున్నాయని, విపరీతమైన దుమ్ము, ధూళితో ప్రజలు అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి ఆయా గ్రామస్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధాకర్, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, గిరిజన సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోందె కుటుంబరావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, నెమ్మళ్ల ఉపేందర్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి..

బూర్గంపాడు: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలపై పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలకు మద్దతుగా ఉండాలన్నారు. ఉప్పుసాక, రాజీవ్‌నగర్, శ్రీరాంపురం గ్రామాల సమీపంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులపై ఫారెస్ట్ అధికారుల దాడులు సరికాదన్నారు. పార్టీ మండల కార్యదర్శి సప్క నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు మున్నా లక్ష్మీకుమారి, నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మువ్వా వెంకటేశ్వరరావు, పేరాల శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, జహీర్, పిచ్చమ్మ పాల్గొన్నారు.

గోడు పట్టించుకునేదెవరు..?

- సమస్యల సుడిగుండంలో 'విశ్వనాథకుంట'
- మౌలిక సదుపాయాలకు దూరం
- పట్టించుకోని పాలకులు, అధికారులు





పొలాల నడుమ, వాగుగుండా రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులు


కరకగూడెం: మౌలిక వసతుల కోసం ఆ గ్రామస్తులు ఎదురుచూస్తు నీరసించారు. అభివృద్ధిలో వెనుకబడి కలలతోనే సర్దుకుపోతున్నారు. కరకగూడెం మండలంలోని భట్టుపల్లి గ్రామ పంచాయతీ విశ్వనాథకుంట (కొమ్ముగూడెం) గ్రామం పరిస్థితి ఇదీ..

రోడ్డు లేదు.. తాగునీరు అందదు..

గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. పొలాల గట్టుల వెంబడి ప్రయాణం సాగిస్తున్నారు. ప్రభుత్వం బ్రిడ్జి 10 ఏళ్ల క్రితం నిర్మించబడినప్పటికీ అది ఇప్పటికీ స్లాబ్ లేకుండా నిలిచిపోయి నిరుపయోకరంగా ఉంది. వానాకాలంలో ఈ బ్రిడ్జి పక్కనే ఉన్న చెరువు, వాగు నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తే గ్రామస్తుల పయనం సంకటంగా మారుతుంది. అత్యవసర సమయాల్లో వృద్ధులు, పిల్లల ఆరోగ్య సేవల కోసం పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. మరోవైపు, మిషన్ భగీరథ పేరిట గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలని ప్రభుత్వం చేపట్టినప్పటికీ.. ఆ పథకం ఈ గ్రామం చేరుకోలేక పోతోంది.

ముంచుకొస్తున్న వర్షాకాలం..

వర్షాలు రాకముందే ముఖ్యంగా బ్రిడ్జికి స్లాబ్ నిర్మాణం పూర్తిచేయాలి. మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వాలి. గ్రామానికి కనీసం ఒక పక్కా రహదారి నిర్మించాలి. ఇవన్నీ సౌకర్యాలు కలిపిస్తేనే ఈ పల్లె ప్రజలు మనుగడ సాగించగలరు. ఈ గ్రామం యొక్క దీనస్థితి అధికారులు, పాలకుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ఇప్పటికైనా ఇక్కడ మౌలిక వసతుల కల్పనకు జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించాల్సి ఉంది.



స్లాబ్‌కు నోచుకోని బ్రిడ్జి ఇదే..

పట్టించుకునేవారు కరువయ్యారు..



మా గ్రామంలో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాం. అభివృద్ధికి దూరంగా ఉంటున్నాం. కనీస సౌకర్యాలు లేక నానా అవస్థలు పడుతున్న పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రభుత్వాలు మారుతున్నా.. పాలకులు మారుతున్న మా జీవితాల్లో మార్పు లేదు.

– పాయం నాగేశ్వరరావు, గ్రామస్తుడు

నిర్లక్ష్యానికి గురవుతున్నాం..



మా గ్రామం అభివృద్ధికి నోచుకోలేదు. మౌలిక వసతులు కూడా మాకు అందుబాటులో లేవు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేదు. సీసీ రోడ్డు లేదు. పదేళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జికి స్లాబ్ లేకపోవడంతో వర్షాకాలం వస్తే మా కష్టాలు వర్ణనాతీతంగా ఉంటాయి.

– దాట్ల సమ్మయ్య, గ్రామస్తుడు

మమ్ముల్ని పట్టించుకోవాలి..



దశాబ్ద కాలంగా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్నాం. ప్రభుత్వాలు మారినా అధికారుల నిర్లక్ష్యం మాత్రం మారడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు వచ్చి ఓట్లు అడుగుతున్నారు. ఆ తర్వాత మమల్ని పట్టించుకునే నాథుడే లేదు.

– బాడిశ సుగుణ, గ్రామస్తురాలు